# స్త్రీ కిరణాలు



శ్రీమతి కందుకూరి సత్య సూర్య కుమారి

# కథల వరుసక్రమం


| | | పేజి |
|---|---|---|
| మా వదిన | - | 9 |
| యంగ్ బ్లడ్ | - | 15 |
| తీరని బాధ | - | 28 |
| బెటర్ హాఫ్ | - | 35 |
| ప్రేమాయణం | - | 43 |
| మలుపు | - | 54 |
| పులుసులో బూరి ముక్క | - | 60 |
| పసి హృదయం | - | 68 |
| పవిత్ర బంధం | - | 78 |
| బెలూన్ | - | 85 |
| దేవోభవ | - | 90 |
| మూల్యం-అమూల్యం | - | 96 |
| దత్తత | - | 105 |
| మన్మధ మాధవీయం | - | 113 |
| స్వచ్ఛ భారత్ | - | 118 |

# యంగ్ బ్లడ్

'విమ్మీ... విమ్మీ... ఇంకా లేవలేదూ? అప్పుడే ఏడవుతోంది' అంటూ వచ్చింది వదిన సరోజ.

'అబ్బ ఏమిటి నీ గొడవ కాస్సేపు పడుక్కోనీ' అంటూ గోడవైపు తిరిగి పడుకుంది విమల.

'విమ్మీ అప్పుడే కలలు కంటున్నావా?' అంది సరోజ ఆనందంతో ఉక్కిరిబిక్కిరౌతూ.

'ఊ' అని విదిలించుకుంది వదిన చేతిని.

'విమ్మీ! ఇంకా ఏమిటి పడక' అంటూ నారాయణ వచ్చాడు హడావిడిగా. 'సరూ, వెళ్లి మా అమ్మకాస్త హెల్పు చెయ్యి. అదే లేస్తుందిలే' అన్నాడు కొంచెం చిరాగ్గా.

'అత్తయ్యే లేపి రమ్మన్నారు' అని నొచ్చుకుని అక్కణ్నుంచి వెళ్లిపోయింది.

వాళ్ల సంభాషణ వింటూనే ఉన్న విమల గబగబా లేచింది నిద్ర బద్ధకం వదిలించుకుని. చెల్లెల్నేమీ అనలేక భార్యమీదే చిరాకు ప్రదర్శిస్తాడు, నారాయణ. విమలకూ తెలుసు అన్నయ్య సంగతి. సరోజమీద అనవసరంగా చిరాకుపడితే విమలకీ జాలేస్తుంది. సరోజ కూడా చదువుకున్నదైనా ఎదురు మాట్లాడదు.

నారాయణ తన గదిలో డ్రెస్ చేసుకుంటున్నాడు. సరోజ భర్తక్కావలసిన వస్తువులందిస్తూ అక్కడే ఉంది. బాత్‌రూమ్‌లో ఉన్న విమలకు అన్నా వదినల సంభాషణ వినిపిస్తోంది.

'అమ్మాయిని చూడకుండా కట్నం గురించే ముందు మాట్లాడ్డమేమిటండీ. అంటే వాళ్లకి కట్నమే ముఖ్యమన్న మాట.'

'అదే మంచిదిలే. అమ్మాయిని చూసుకుని వెళ్లి, తర్వాత అమ్మాయి నచ్చినా కట్నం నచ్చక వదిలెయ్యడంకంటె'

'కట్నంకోసం చూసే వాళ్ల దగ్గర అమ్మాయేం సుఖపడుతుంది?'

'వాళ్లడిగింది ఇవ్వగలం మనం. అమ్మాయిని చూపిస్తూ వాళ్లు నచ్చలేదంటే ఇంకో సంబంధం వెతకడం... అలాకంటే ఇదే బాగుంది' అన్నాడు నారాయణ అద్దంబల్లముందు కూర్చుంటూ. 'మనం వాళ్లడిగినంత ఇవ్వగలం కదా! అతను మెరైన్ ఇంజనీరు. మన విమల నచ్చితే అది చాలా అదృష్టవంతురాలు.'

'డబ్బు నచ్చిందిగా మొదట, విమలకేం లోటు? నచ్చకపోవడానికి. అందం వుంది. చదువుంది. విమలకే అతడు నచ్చాలి' అంది గర్వంగా సరోజ.

'వదినా నీదే కరెక్ట్' అంది వాళ్లకి వినిపించేలా, తన గదిలోనుండే.

ఇద్దరూ తడబడ్డారు. విమల వచ్చింది నారాయణ గదిలోకి.

'సారీ, మీ మాటలు నేను వినలేదు. విన్పించాయి విన్నాను' అంది సంజాయిషీగా నవ్వుతూ.

'భలేదానివే విమ్మీ. రహస్యమేం కాదులే.' అన్నాడు నారాయణ.

'పెద్ద ఆఫీసర్ట. నిన్ను చూసుకోడానికి...'

'విన్నాలే. అంతటి ఆఫీసరు రావడం అదృష్టం కదూ' అంది విమల, నంగనాచిలా.

'నిజంగా ఇదేకాని కుదిర్తే అది మన అదృష్టం...'

'ఏమిటన్నయ్యా అదృష్టం డబ్బు ఇచ్చుకుని కొనుక్కునేటప్పుడు అదృష్టమేమిటి? మనకు స్థోమతుంది. అంతేగాని...'

'అది కాదు విమ్మీ...'

'ఏది కాదు. నాన్న రెక్కల కష్టంవల్ల నిన్నూ నన్నూ చదివించేరు. కొంత వెనకేసేరు. ఆయన కష్టార్జితమే కదా! సరే ఎవరి వాళ్లకు వారు పెడతారు. పోషిస్తారు. వదినకు రవ్వల దుద్దులు చేయించావంటే అది అదృష్టమా! డబ్బిచ్చావు. చేయించావు. గాడ్రేజు బీరువా కొన్నావు. అది అదృష్టమా! ఈ ఇల్లు కొన్నారు నాన్న. దీన్ని అదృష్టమనరు. కృషికి ఫలితం దక్కిందనాలి. అదృష్టమంటే లాట్రీలో గెలుపు రావడం. ఐశ్వర్యవంతుడు ఒక బీదపిల్లను ఆదర్శంగా పెళ్లి చేసుకుంటే ఆమె అదృష్టం. అంతేకాని డబ్బిచ్చి కొనుక్కుంటూన్నప్పుడు ఇంక అదృష్టమేమిటి? ఎవరి స్థోమతనుబట్టి వాళ్లు కొనుక్కుంటారు.'

'మరీ అంత కనీసంగా అనకూడదు విమ్మీ. కట్నం అనేది వరదక్షిణ.'

'నీ కోసం ఇస్తున్నామే తప్ప ఎవరికో ఇవ్వడం లేదుగా. నాన్న నీ కోసమనే ఇన్సూరు చేసేరు. నీ డబ్బు నీ కివ్వడంలో...' భార్యను సమర్థించేడు నారాయణ.

'నాకు ఇస్తున్నారా? ఐతే నా పేర బేంకులో వేస్తున్నారా? నాకు తెలుసు. వాళ్ల చేతికివ్వాలి. ఇవ్వకపోతే పీటలమీద పెళ్లి ఆగిపోతుంది.

'అంతవరకు వస్తుందా ఏమిటి? ఇచ్చేవాళ్లం పుచ్చుకునేవాళ్లం చూసుకుంటాం. నీకెందుకు మధ్య. అయినా ఇంకా అబ్బాయిని చూడలేదు. ఎందుకీ వాదన' అంటూ బయటికి వెళ్లిపోయాడు నారాయణ.

'అవును. మరి. తనూ మగవాడేగా. తన మామగారు అప్పుచేసి తెచ్చిన కట్నమైనా

# ములుపు

"ఇదిగో... త్వరగా వచ్చెయ్యి నే చెప్పింది గుర్తుందిగా" ప్లాట్‌ఫాం మీద నించుని సిగరెట్టు దమ్ము పీల్చి వదుల్తూ రైల్లో కూర్చున్న రమతో కరుకుదనంగా చెప్తున్నాడు విశ్వం. ఆమె తనకొక చక్కటి పేరు వుందని పెళ్ళయి కాపురానికి కొచ్చిన మర్నాడే మర్చిపోయింది.

భార్య వియోగాన్ని భరించలేని అనురాగం గల భర్తగా ఆ మాట అంటే ఆమె ఆనందానికి అవధులు వుండేవి కావు. స్వార్థం, క్రూరం మేళవించుకున్న ఆ మాటలు చాలా కర్కోటకంగా వున్నాయి.

"ఊఁ. అలాగేనండీ" నెమ్మదిగా భయంగా అంది రమ, కట్టుకున్నందుకు గౌరవం ఇస్తూ. దీనంగా కిటికీ ఊచల్లోంచి చూస్తోంది. అందచందాలు లేకపోయినా తిండీ బట్టకూ కొరత లేని ఉద్యోగం చేస్తున్నాడు. పెద్ద భవంతులు కాకపోయినా ఓ చిన్న పెంకుటిల్లుంది. దాన్నే నందనవనంగా మార్చుకుని తృప్తిపడొచ్చు అని ఆశించి విశ్వనాథ్‌ని మనసారా ప్రేమించి పెళ్ళికి ఒప్పుకుంది.

"మా నాన్నకు అంత స్థోమతు లేదండీ. మీకు ఇవ్వాల్సిన కట్నం అతి కష్టంమీద ఇచ్చారు. దానికి చేసిన అప్పు ఇంకా తీరలేదు. ఇంక ఏమీ ఇచ్చే స్థితిలో లేరు. మా నాన్న పరిస్థితి ఏమిటో నాకు తెలియదా చెప్పండి!" పుట్టింటికి వెళ్ళడానికి నిరాకరిస్తూ వేడుకుంది. దానికి ఫలితంగా అతని పశుత్వాన్ని చవిచూచింది రమ.

అప్పటికే ఎన్నోసార్లు ఏదో విధంగా హింసిస్తూనే వున్నాడు విశ్వం. అత్తగారి పోరు ఎక్కువయింది. కట్న కానుకల్లో లోపం జరిగిపోయిందని ఎన్నోసార్లు అవమానించిన సన్నివేశాలున్నాయి. రమ మనస్సు చచ్చిపోయింది. కాని శరీరం చావలేనంటుంది. ఏడాది కావస్తున్నా సంసారం మీద క్రొత్త ఆశ ఇంకా చిగురిస్తూనే వుంది ఆమెలో. తల్లీ కొడుకులు పెట్టే హింసలు భరిస్తుంది. నును సిగ్గులతో ఎరుపెక్కాల్సిన లేతబుగ్గలు చేతివ్రేళ్ళతో తట్లు తేరిపోయేవి. ఏనాటికైనా అతనిలో మానవత్వం కలుగుతుందేమోనని ఎదురుచూస్తోంది.

ఆనందం, సుఖం మేళవించిన జీవితాల్లో యుగాలు క్షణాల్లా దొర్లిపోతాయి. క్షణాలు యుగాల్లా గడిచే సంసారాలు వున్నాయంటే అతిశయోక్తి కాదేమో!

రైలు కూత కూసింది బయల్దేరుతూ. "నే వెళ్తున్నా." సమాధానంకోసం చూడకుండా

దర్జాగా వెళ్ళిపోయాడు విశ్వం.

చల్లనిగాలి కిటికీలోనుండి వీస్తోంది. కమ్మగా కబుర్లు చెప్పుకుంటోంది ఎదురుగా కూర్చున్న జంట. సాధింపులు, వేధింపులూ లేని బ్రతుకులో కొచ్చినట్లుంది. కాని అది క్షణికమే అనుకునేసరికి భయం ఆవరించింది. "హేపీ మేరీడ్ లైఫ్" అంటే ఏదో ఆనందంగా అనిపించింది ఒకప్పుడు. కాని 'హేవ్ లోన్‌లీ లైఫ్' ఆనందంగా అన్పించింది రమకి ఇప్పుడు.

ఎదురు బెంచిమీద కూర్చున్న భార్యా భర్తా, ముచ్చటగా ఇద్దరు పిల్లలూ ఆప్యాయతా, అనురాగాలతో కబుర్లు చెప్పుకొంటున్నారు. ఒకప్పుడు తను అలాంటి జీవితాన్ని ఊహించుకుని కలలు కన్నది.

ఎదురుగా కూర్చున్న ఆ కుటుంబాన్ని చూస్తే క్రొత్త ఉత్సాహం వస్తుందేమో అన్నట్లుంది. తన సమస్యలను, కష్టాలను మర్చిపోయి ముగ్ధురాలై చూస్తోంది వాళ్ళను.

రమ భర్త విశ్వం, విశ్వామిత్రుడి ప్రాణ స్నేహితుడూ, రావణాసురుడి ప్రియ బంధువూ అయి వుంటాడు నిస్సందేహంగా. ఎదురుగా కన్పించే ఆ కుటుంబాన్ని చూసి తన భర్త గురించి మర్చిపోయి తనూ ఇద్దరు పిల్లలతో ప్రక్కన భర్తను ఊహించుకుని కలలు కంటోంది పిచ్చి రమ.

లాలనగా దగ్గరగా జరిగి కూర్చుంటున్న ఆ భర్త ఆనందరావు. ఆప్యాయంగా భర్త ముఖంలోకి చూసే ఆ భార్య మాధవి. అంత మంచిగా వుండే భర్తలు సినిమాల్లోనూ కథల్లోనేగాని నిజంగా వుంటారని తన వివాహం జరిగాక ఊహించనుకూడాలేదు రమ.

తన పెళ్ళి కాకముందు-త్రాగుబోతు, తిరుగుబోతు. భార్యను హింసించి నరకం చూపించే భర్తలు కథల్లో సినిమాల్లోనే అనుకుంది.

అన్నీ తారుమారయ్యాయి.

స్వర్గం, నరకం ఎదురెదురుగా నిల్చున్నాయి.

మంచి సంబంధం, కూతురు సుఖపడుతుంది అనే నమ్మకంతో విశ్వనాథ్‌కి ఇచ్చి చేసాడు తండ్రి. ఈ పోరు, హింస, క్రూరత్వం అతనిలో లేకపోతే అది మంచి సంబంధమే మరి!

అందరూ అన్నట్లు విశ్వం చాలా బుద్ధిమంతుడు. తల్లిదండ్రుల మాట జవదాటడు. వారి మాటంటే అతి గౌరవం, మర్యాద. వారి మాట వేద వాక్కు. వారి చేష్టలు బ్రహ్మచర్యలు. అందుకే రమ జీవితం నరకప్రాయమైంది. కట్టుకున్న పెళ్ళాన్ని రాచి రంపాన్నపెట్టడంలో తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా వున్నాడు. ఎన్నో ఆశలతో అడుగుపెట్టిన భార్యను ఆదరాభిమానాల్తో చూస్తే లోకువ అని తెలుసుకున్న మహా మేధావి, జ్ఞాని అతడు.

# పవిత్ర బంధం

'నా నాటి బతుకు నాటకము...” రేడియోలో అన్నమయ్య కీర్తన వింటూంది జానకమ్మగారు. అలాంటి కీర్తనలు విన్నకొద్దీ అందులో రసం, సారం ఇంకా ఇంకా వస్తూనే వుంటుంది. జీవితం ఒక నాటకం. ఈ భూమి ఒక రంగస్థలి. ఇదే సత్యాన్ని ఆంగ్ల నాటక రచయిత 'షేక్స్పియర్' చెప్పాడు. అలాగే మన ఆంధ్ర అన్నమయ్య తన కీర్తనలో పొందుపర్చాడు. భాషలు వేరైనా భావం ఒక్కటే.

'పుట్టుటయు నిజము పోవుటయు నిజము
నట్టనడిమి పని నాటకము”

ఎనభై ఏళ్ళు జీవితానుభవంలో వున్న జానకమ్మగారు ఆ కీర్తనను అలా తన్మయత్వంతో వింటూ నిజాన్ని అంత చక్కటి పాటలో వెలిబుచ్చిన అన్నమయ్యకు ఆ ముసలి చేతులు అలా జోడించి కళ్ళు మూసుకుని దణ్ణం పెట్టారు. ఆ పాట ఇంకా రేడియోలో వినవస్తూంది. ఇంతలో రోడ్డుమీద తన ఇంటిముందు పెద్ద గోల, అరుపులూ, కేకలూ, దెబ్బలాటలతో ఏమిటాని గుమ్మం దగ్గరకి వచ్చారు. ఒకవేపు పదిమందీ, మరోవేపు పదిమందీ జనాలు రెండు పార్టీలన్నమాట. ఇద్దరు ముగ్గురు కలిపి ఒకవేపువారు దెబ్బలాడుకుంటున్నారు. అది వినీ వినిపించుకోకుండానే మరోవేపువారు అరుస్తున్నారు. మొత్తానికి జానకమ్మగారికి ఒక్క ముక్క అర్థం కాలేదు. ఆ దెబ్బలాట ఎందుకో అని. అసలు ఏంటి జరగబోతోంది తెలియటంలేదు. ఆవిడ అదృష్టంకొద్దీ ఎవరి చేతిలోనూ కర్రలూ కత్తులూ లేవు. వాళ్ళ కేకలకు కొద్దిపాటి జనం పోగయ్యారు. మధ్యలో ఒక ఆడ గొంతు ఏడుపు. ధనవంతులు కాస్త సైలెంటుగా ఏడుస్తారు. అదే మరి లేబరువాళ్ళు నిర్మొహమాటంగా గట్టిగా అందరికీ వినిపించేట్టు ఏడుస్తారు. ఆ ఏడుస్తున్న మనిషిని గుర్తించారు జానకమ్మగారు. అది లచ్చుమ్మ. లక్ష్మి. దానిమీద అరుస్తూ ఎగురుతున్న మనిషి పద్మ.

వాళ్ళందరూ జానకమ్మగారికి పరిచయమే. ఇరవై ఏళ్ళనుండీ వాళ్ళూ ఆ చుట్టుపక్కలే

నివసిస్తున్నారు. అసలు విషయమేమిటో ఆవిడకి అర్థం కాలేదు.

లచ్చమ్మ చాలా మంచి పిల్ల. పాతికేళ్ళుంటాయి. చిన్న వయసుస్సులో పెళ్ళయిపోయింది. అప్పుడే ఇద్దరు పిల్లలు దానికి. పెద్దవాడికి ఎనిమిదేళ్ళు. చిన్నవాడికి నాలుగేళ్ళు. దాని దురదృష్టంకొద్దీ ఇద్దరు పిల్లలకీ చప్పిడి కాళ్ళు. ఇద్దరూ నడవలేరు. దేక్కుంటూనే జీవిస్తున్నారు. అలాంటి పిల్లలంటే ఇంకా జాలీ దయా చూపించాల్సిన పరిస్థితి. నవ మాసాలూ మోసి కని పెంచుతున్న తల్లి ఇద్దర్నీ రెండు కళ్ళల్లాగా చూసుకుంటోంది. ఇంటిపనులకి వెళ్తూ ఇద్దరికీ ఏం తిండి పెట్టేదో ఎలా చేసేదో పాపం ఇంట్లో పెట్టి తలుపేసి వెళ్ళేది. చంటి వెధవలు ఇద్దరూ బుద్ధిగానే కన్పించేవారు. వాళ్ళ బడ్డీ ముందు సత్తువలేని కాళ్ళు జాపుకుని ఆ మట్టిలో ఆడుకుంటూ వుంటారు.

చాలాసేపు రోడ్డుమీద గొడవపడి ఆఖరికి రెండు పార్టీలు ఎవరి మానాన్న వాళ్ళు వెళ్ళిపోయారు. జానకమ్మగారు అప్పటికే లోపలికెళ్ళిపోయారు. అసలు సంగతేంటో తర్వాత తెలుస్తుంది అనుకుంటూ. లచ్చమ్మ జానకమ్మగారింట్లో పనిమనిషి. దాని వాలకం చూసారుగా ఇక పన్లోకి వస్తుందని నమ్మకం లేదావిడకి.

"జానకీ..." రామయ్యగారు కాలకృత్యాలు తీర్చుకుని పేపరు చేతిలోకి తీసుకుని సోఫాలో కూర్చుని టి.వి. వేసారు.

"వస్తున్నా" అంటూ కాఫీ గ్లాసు అందించి తనూ ఓ సోఫాలో కూర్చున్నారు జానకమ్మ.

"ఏంటా గొడవ నడిరోడ్డుమీద?" పేపరులోంచి మొహం పైకెత్తి అడిగారు.

"నాకు మాత్రం ఏం తెలుసు?" అంది ఆవిడ.

"వీధిలోకెళ్ళావుగా" అన్నారు ఆయన.

ఏహీ పట్టించుకోనట్టుంటారు గానీ అన్నీ గమనిస్తూనే వుంటారు, అనుకుందావిడ మనస్సులో.

"ఆ. వెళ్ళాను. ఏమిటో వాళ్ళ గొడవలు. మనకర్థం కావు" అంది జానకమ్మ. "మన లచ్చమ్మ ఏడుస్తోంది. దాని మొగుడూ ఏదో దాన్నే దెబ్బలాడుతున్నాడు. వాడ్ని మరో కొంతమంది కొట్టినంత పని చేసారు" అన్నారావిడ చూసిందాన్నిబట్టి అదీ అర్థమయింది ఆవిడకి.

ఆ పూటకి అవసరమైన పని జానకమ్మగారు చేసుకుని వంట కూడా నెమ్మదిగా ముగించి వచ్చి నడుం వాల్చారు. పనులు చేసుకునే వయస్సు దాటింది. పిల్లలు ఎవరి సంసారాల్లో వాళ్ళు మునిగిపోయారు. ఓపికున్నంతవరకూ ఇద్దరం ఒకరికొకరం తోడు.

# దత్తత



రైలు వేగంగా వెళ్తోంది. ఇంకా ప్రయాణీకులందరూ నిద్రలోనే వున్నారు. ఇప్పట్నుండి లేచి చేసేదేముంది? సమయం దొరికినప్పుడే హాయిగా నిద్రపోదాం అనీ అయివుంటుంది. ప్రొద్దెక్కేదాకా పడుకుకే అలవాటున్నవాళ్ళూ చాలామందే వుంటారు.

శాస్త్రికి రాత్రంతా కూడా మగతగానే నిద్ర పట్టింది. తను పుట్టిందీ పెరిగిందీ, ఆడిందీ పాడిందీ అన్నీ తను వెళ్ళబోయే ఊళ్ళోనే. అది చిన్న పల్లెటూరు. ప్రేమానురాగాలకు పుట్టినిల్లు. తోటి స్నేహితులు తనకు పరాయివాళ్ళు కాదు. తోబుట్టువులకంటె ఎక్కువ.

చెరువులో ఈతకి అందరూ కలిసి వెళ్తే టైమే తెలిసేది కాదు. ఆకలి టైముకి ఇళ్ళకి చేరేవారు.

స్కూలు చదువయ్యేవరకూ ఆ ఊరు దాటి వెళ్ళలేదు శాస్త్రి. తర్వాత తన చదువుకోసం తండ్రి మకాం పట్నం మార్చాక మళ్ళీ ఆ ఊరు వెళ్ళే సందర్భం రాలేదు. ఏవో పన్లుంటే తండ్రి మాత్రం వెళ్ళొచ్చేవారు.

తన ఊళ్ళో తన స్నేహితుల మధ్యకు అడుగు పెట్టబోతున్న శాస్త్రి ఆనందానికి అవధుల్లేవు. చిన్న వయస్సులోనే జిల్లా కలెక్టరు కావడం తమ ఊరివాళ్ళకు కూడా గర్వకారణమని తన తండ్రి, స్నేహితుల ద్వారా తన పేరు ఆ ఊళ్ళో మారుమ్రోగుతోందని కూడా విన్న శాస్త్రికి ఆ ఊరు తనకు ఆహ్వానం పలుకడంతో ఎప్పుడెప్పుడు అక్కడ వాల్తానా అని ఉవ్విళ్ళూరుతున్నాడు. పాత చెరువూ, పొలం గట్లూ... ఒక్కసారి మళ్ళీ ఆ జ్ఞాపకాలను జీర్ణించుకుంటున్నాడు.

శాస్త్రికి అలవాటు ప్రకారం అయిదింటికే మెలుకువ వచ్చేసినా అందరూ గాఢనిద్రలో వుండడం చూసి తనూ కాస్త వెలుగు తెర కనుపించేవరకూ కళ్ళు మూస్తూ తెరుస్తూ కాలక్షేపం చేస్తున్నాడు. ఓసారి వాచీ వంక చూసాడు. చీకటి ఛేదించబడుతోంది. అందరూ లేస్తే ఇక బాత్‌రూమ్‌లు ఖాళీలుండవు అని నెమ్మదిగా తన బెర్తు క్రింద పెట్టుకున్న బ్యాగ్ ఇవతలకు లాగి బ్రష్షూ, పేస్టు, నేప్‌కిన్ తీసుకుని బాత్‌రూమ్‌లవైపు నడిచాడు.

రైల్వే సిబ్బంది వాళ్ళ డ్యూటీ ప్రకారం వాళ్ళు బాగానే నీట్‌గా బాత్‌రూమ్‌లు కడిగి వెళ్తారు. ప్రయాణీకులు కూడా తమ వంతు బాధ్యతగా వాళ్ళ పని కానిచ్చి కాస్త నీళ్ళని ధారాళంగా వాడకపోతే ఎవరేం చెయ్యగలరు? అందరూ ముక్కు మూసుకుని వెళ్ళేవాళ్ళే కానీ వాడుకుని మళ్ళీ యధావిధిగా వుంచాలన్న ధోరణి ఎవరికి వారికి వుండాలి అని ఒకప్పుడు చదువుకునే రోజుల్లో వాపోయేవాడు శాస్త్రి.

కాని ఈరోజు తన హోదాకు తగినట్లు ఫస్ట్ క్లాస్ ఏ.సి.లో ప్రయాణం చేస్తూ తన ఊరికి వెళ్తున్నాడు.

కాలకృత్యాలు తీర్చుకుని తిరిగివచ్చాడు శాస్త్రి. ఇంకా అందరూ నిద్రలోనే వున్నారు.

దొరికిందే సమయం అని ఆడవాళ్ళూ హాయిగా పడుక్కునే వున్నారు. ఇంటిదగ్గరైతే కుదరకపోవచ్చు చాలామందికి. ఆఫీసులకి తెమలాలి, తెమల్చాలి. పిల్లలుంటే స్కూళ్ళకి. నిశ్చింతగా పడుక్కున్నారందరూ.

రైల్లో ఎన్నిసార్లు ప్రయాణం చేస్తున్నా ఎప్పుడూ క్రొత్తగా వున్నట్లే అనిపిస్తుంది. రైలు ప్రయాణం సరదాగా హుషారుగా కూడా వుంటుంది. రైలు చాలా స్పీడుగా వెళ్తోంది.

# మన్మధ మాధవీయం

ఎండ తీవ్రంగా వుంది. వర్ధనమ్మగారు ఆదరాబాదరా ఇంట్లోకొచ్చారు. వీధి తలుపు తీసే వుంది.

"మాధవీ ఎక్కడున్నావ్?" గట్టిగానే పిల్చారు.

"ఇక్కడున్నానమ్మా. అప్పుడే వచ్చేసావా?" అంది గోడగడియారంవైపు చూస్తూ. మహిళా సమాజాన్కి వెళ్ళింది ఆవిడ.

"అప్పుడే ఏమిటే పన్నెండు దగ్గరవుతోంది. నాన్నగారు వచ్చే లోగా వచ్చేద్దామని వచ్చేసేను. ఇంకా మిగతా అందరూ వున్నారు అక్కడ" అంది వర్ధనమ్మగారు. "సరేకానీ వంట చేసావా? అయిందా..."

మాధవి హడలిపోయింది.

రోజూ వంట బాధ్యత తల్లిదే. ఎప్పుడైనా అవసరమైనప్పుడే తనకి పురమాయిస్తుంది. మాధవి చదువుతున్న పుస్తకంలో లీనమైపోయి ఆ వంట సంగతే మర్చిపోయింది.

"ఇదిగో ఇప్పుడే..."

"ఏమిటి? మర్చిపోయావా!" కంగారుగా అడిగిందావిడ. ఇది ఆవిడకి క్రొత్త కాదు. ఇదివరలోనూ ఇలాగే అయింది.

"ఎలా మర్చిపోయావే?" అంటూ గబగబా గిన్నెలో బియ్యం పోసి కుక్కర్‌లో పెట్టేసింది. అది ఉడికేలోగా తరిగిన వంకాయముక్కలు తాళింపు వేసి పెట్టింది మరోప్రక్క స్టౌ మీద.

తన మతిమరుపుకి మనసులోనే తిట్టుకుంటూ మళ్ళీ చేతిలోకి పుస్తకం తీసింది మాధవి.

"ఇలాగే చెయ్యి. రేపొద్దున్న అత్తారింటికి వెళ్ళాక నన్ను అంటారు. తల్లి అసలు బాధ్యత నేర్పలేదని." కూతురు వంట చెయ్యడం మర్చిపోయినందుకు ఆమె దిగులు కాదు. గ్యాస్ స్టౌ మీద వంట ఎంతసేపు! కాని రేపొద్దున్న అత్తగారు దాన్నీ, తల్లినీ మాటలంటారని బాధ.

"అత్తారింటికి వెళ్తే కదా! నీ బాధ!" అని మాధవి అటు నెమ్మదిగా కాకుండా గట్టిగా కాకుండా అనేసింది.

అమ్మ కాస్త ముందు వచ్చేసింది కాబట్టి గండం గడిచింది అని నిట్టూర్చుకుంది మాధవి. ఏ చిన్న పొరపాటు జరిగినా 'రేపొద్దున్న అత్తారింటికి వెళ్ళి' ఇదే డైలాగు మాధవికి వినీ వినీ బుర్ర బొప్పికట్టింది.

అత్తారిల్లంటే అదొక జైలు అన్న భావం కూడా మనస్సులో స్థిరపడిపోయింది. ఫ్రెండ్సిళ్ళకి వెళ్ళి కాస్త లేటైనా, తదేకంగా చదువులో నిమగ్నమైనా, ఎక్కడి పుస్తకాలక్కడ పెట్టకపోయినా, విప్పిన బట్టలు వెంటనే తీసి సర్దకపోయినా ఏదైనా అత్తారిల్లు ప్రత్యక్షమైపోతుంది.

అందుకే మాధవి పెళ్లి అంటేనే విముఖత చూపించడం మొదలుపెట్టింది.

అయినా తల్లిదండ్రులు వారి బాధ్యత నెరవేర్చాలిగా! లేకపోతే 'లోకులు ఏదో అంటారు.'

మన దేశంలో మన సంసారం గురించి లోకులకే ఎక్కువ ఆసక్తి మరి.

ఆరోజు పొద్దున్నే జాజి పందిరి దగ్గర కుర్చీ వేసుకుని కూర్చుని మల్లెలు మాల కడుతోంది మాధవి.

' 'అత్తారిల్లు' పేరు పెట్టి అమ్మ పువ్వులు కట్టడమేమిటి కుట్లూ అల్లికలూ నేర్పింది. సంగీతం రావాలి ఆడపిల్లకు అని నేర్పించింది. ఎంత పెద్దవాళ్ళయినా పాడుకోవచ్చు అని. అమ్మాయి ఏం చదివింది అంటారు పెళ్ళివారని డిగ్రీ పూర్తి చేయించారు తల్లిదండ్రులిద్దరూ ఏకమై. డిగ్రీ పూర్తయ్యేసరికి ఇంకా ఏ సంబంధం కుదరక, నచ్చకపోయేసరికి ఊరికే కూర్చోడమెందుకని పోస్టుగ్రాడ్యుయేషన్ చేయించారు. ఒక్క నిముషం బాతాఖానీ కొట్టినా బద్ధకంగా నిద్రపోయినా 'రేపొద్దున్న అత్తారిల్లు' అమ్మ డైలాగ్ తప్పదు. ఊహ తెలిసినప్పటి నుండి అత్తారిల్లు మనస్సుని పట్టేసింది. అత్తా లేదు ఇల్లూ లేదింకా పోస్ట్ గ్రాడ్యుయేట్ని అయిపోయాను. '

సరే. ఎలాగూ మనస్సు నిండా అత్తా ఇల్లూ అలుముకుపోయేసరికి ఆ అత్త కొడుకుని ఊహాగానం చెయ్యడం మొదలుపెట్టింది మాధవి.

ఇంత చదివి చెట్టు కింద కూర్చుని పూలు గుచ్చడంకంటె ఉద్యోగంలో చేరాలనే కోర్కె పుట్టింది మాధవికి.

తను చదివిన కాలేజీలోనే ఉద్యోగం వచ్చింది.

# స్వచ్ఛ భారత్

**కా**లింగ్ బెల్ మ్రోగటంతో జానకమ్మగారు వీధి తలుపు తీసారు.

"నమస్కారమమ్మా" అందావిడ జానకమ్మగారిని చూస్తూనే. ప్రక్కనే పదిహేనేళ్ళుంటాయేమో ఓ అబ్బాయి కూడా వున్నాడు. ఆ అబ్బాయి కూడా మౌనంగా నమస్కరించాడు.

ప్రతినమస్కారం చెయ్యడం భారత జాతి సంస్కారం. జానకమ్మగారు రెండు చేతులూ జోడించారు.

"ఆనంద్ బాబుగార్ని కలవాలని..." అందామె నమ్రతతో.

"రండి. ఇలా కూర్చోండి. అబ్బాయి వస్తాడు" అంటూ కుర్చీలు చూపించిందావిడ.

"ఆనంద్ బాబు మీ అబ్బాయిగారా?" అడిగిందావిడ. అతడి పేరుకి 'బాబు' తగిలించి.

"ఊ" అంది జానకమ్మగారు. "కూర్చోండి" రెట్టించింది. ఆ వచ్చిన ఆమెను చూస్తే జానకమ్మకు ఓ పెద్దింటి కుటుంబీకురాలు అన్పించింది. పెద్దింటి కుటుంబం అంటే లక్షాధికారీ కోటీశ్వరులూ అని కాదు. కళ్ళల్లో ఒక వెలుగు. ముఖంలో కల్మషం లేని చిరునవ్వు. మర్యాద, మంచితనం, హుందాతనం ఉట్టిపడుతోంది. నుదుట ధరించిన విభూతిరేఖా ఆమె ఆధ్యాత్మిక ధార్మికతను తెలియపరుస్తున్నాయి. ఆమె పలుకరించిన తీరు సరస్వతీ కటాక్షాన్ని తెలియజేస్తూంది.

"రెండు సంవత్సరాలబట్టీ నేను ఆఫీసు చుట్టూ తిరుగుతున్నా నా పని పూర్తి కాలేదమ్మా. అలాంటిది ఆనంద్ బాబుగారు నా అదృష్టంకొద్దీ ఈ వూరు బదిలీ కావడంతో నాకు చాలా సహాయం చేసారమ్మా..." ఆ వచ్చినామె చెప్తోంది ఆమెకు జరిగిన అన్యాయం గురించి.

జానకమ్మ వింటోంది మౌనంగా. సంతోషం అయినా దుఃఖమయినా ఎదటివాళ్ళతో పంచుకుంటే మనస్సు చాలా తేలికపడుతుంది. వాళ్ళని ఎదుటివాళ్ళు అర్థం చేసుకుని వింటుంటే బాధ తీరిపోతుంది.

జానకమ్మకి విషయం పూర్తిగా అర్థం అయింది. తరాలు మారుతున్నా అవతారాలు

మారడంలేదు. సంఘంలో మార్పు చోటుచేసుకోవటంలేదు. ముసలీ ముతకా అనికానీ, జాలీ దయా అనికాని లేకుండా పోతోంది కొంతమందిలో. ఎవర్ని ఎలా దోచుకుందామా అన్న ధ్యాస పోవడంలేదు. ఏ మారుమూలో మంచీ మర్యాదా కూడా దాక్కుని తొంగి చూస్తుంటాయి అప్పుడప్పుడు.

ఈ వచ్చినామె మాత్రం తన కొడుకుకి 'బాబు' అని బిరుదు కలిపింది ఆప్యాయంగా. చాలా మంచివాడు అని మెచ్చుకోలుగా ఆనందంగా చెప్పింది. జానకమ్మగారికి కూడా చాలా సంతోషంగా అన్పించింది. సమాజంలో మంచి పేరుకీ, మెచ్చుకోలుకీ ఉన్న విలువ దేనికీ ఉండదేమో! అది కూడా పైపై మెరుగులా కాకుండా స్వచ్ఛంగా వుంటే అంతకన్న ఓ కన్నతల్లికి ఏం కావాలి ఆనందించడాన్కి. తన కొడుకుని ఓ అపరిచితురాలు పొగుడుతూంటే ఆమె మనస్సు దూదిపింజలా అయిపోయింది.

"ఆఫీసు చుట్టూ తిరిగి తిరిగి విసుగుపుట్టి ఓపిక పోతున్న సమయంలో ఆనంద్ బాబుగారు ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయి రావడం నా అదృష్టంకొద్దీ జరిగింది. ఆయన వచ్చాక నా పనిని క్షణాల్లో పూర్తి చేసారమ్మా" అందావిడ ఆనందంగా.

జానకమ్మగారు శ్రోతగా ఉండిపోయారు.

ఆనంద్ రావడంతో, "అదిగో అబ్బాయి వచ్చాడు" అంటూ ఆవిడ అక్కడనుండి లోపలికి నడిచారు.

"మీ మేలు మర్చిపోలేము బాబూ. ఇంతకాలం ఆఫీసు చుట్టూ త్రిప్పించారు. మీరు వచ్చాక కాని నా ఫైలు కదల్లేదు. మీ వల్ల...." ఆవిడ కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. మాట పెగల్లేదింక. లేచి నిల్చుంటూ గబగబా చెప్పసాగారామె రెండు చేతులూ జోడిస్తూ.

తాను తెచ్చిన చిన్న పళ్ళబుట్టను తీసి అక్కడున్న టీపాయ్ మీద పెట్టారు. దాని పైన ఓ తెల్లని కవరు కూడా వుంది.

ఒక్క క్షణం వెనక్కి అడుగు వేసాడు ఆనంద్.

"అమ్మా... చూడండి. నా విధి నేను నిర్వర్తించాను. మీకు నేనేం ఎక్కువ చెయ్యలేదే! నా కర్తవ్యం నేను నిర్వహించడాన్కి నాకు గవర్నమెంటు జీతం భత్యం ఇస్తోంది. నేను మీకు ప్రత్యేకం చేసిందేమీ లేదు. ప్లీజ్... ఇలాంటివి తీసుకోడం నా మనస్సాక్షికి విరుద్ధం" ఖచ్చితంగా అన్నాడు ఆనంద్.

"ఆనంద్ బాబూ కాదనద్దు... నేనేం ఎక్కువ..." స్వంత తమ్ముడితో మాట్లాడినంత చనువుగా అందామె.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Surya+Kiranalu**

* * *